ప్రజాశక్తి

శనివారం 28 సెప్టెంబరు 2024

5

శ్రీకాకుళం

పలాస ఆర్‌డిఒగా స్వామినాయుడు

భరత్ నాయక్ బదిలీ

పలాస : పలాస ఆర్‌డిఒగా వి.స్వామినాయుడును నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన రాజమహేంద్రవరంలో పర్యాటకశాఖ రీజనల్ డైరెక్టర్‌గా ప్రస్తుతం పనిచేస్తున్నారు. బదిలీపై ఆయన ఇక్కడికి రావాల్సి ఉంది. అయితే పర్యాటకశాఖలోనే ఆయన కొనసాగేందుకు సుముఖత చూపుతున్నట్లు తెలిసింది. ప్రస్తుత ఆర్‌డిఒ భరత్ నాయక్ కర్నూలు జిల్లా పత్తికొండ ఆర్‌డిఒగా బదిలీ అయ్యారు. గతేడాది అక్టోబరు 25వ తేదీన పలాస ఆర్‌డిఒగా విధుల్లో చేరిన ఆయన సార్వత్రిక ఎన్నికలను విజయవంతంగా నిర్వహించారు.

ఈ ఏడాదికి ఇంతే..!

- ఖరీఫ్‌లో పంటల సాగు 90శాతమే
- 31,705 ఎకరాల మేర తగ్గిన వరి
- వంశధార ఆయకట్టు భూముల్లోనూ గణనీయంగా తగ్గుదల
- సాగునీరందించడంలో ప్రభుత్వ వైఫల్యం

జిల్లాలో ఈ ఏడాది వర్షాలు కాస్త బాగున్నా, అనుకున్న మేర పంటల సాగు మాత్రం కాలేదు. జిల్లాలో అత్యధిక మండలాల్లో అధిక వర్షపాతం నమోదైనా వరి పంట లక్ష్యం చేరలేదు. అల్పపీడనాల ప్రభావంతో వర్షాలు కురవడంతో రిజర్వాయర్లు, బ్యారేజీల్లో పుష్కలంగా నీరున్నా శివారు భూములు మాత్రం తడవలేదు. వంశధార ఆయుకట్టు కింద ఉన్న మండలాల్లో సైతం వరి సాగు లక్ష్యంతో పోలిస్తే చాలా వ్యత్యాసం కనిపిస్తోంది. వంశధార కుడి, ఎడమ కాలువల్లో గుర్రపుడెక్క, పూడిక పేరుకుపోవడంతో శివారు భూములకు నీరు చేరలేదు. జిల్లాలో అన్నిరకాల పంటల సాగు 41,040 ఎకరాల్లో తగ్గగా, అందులో వరి సాగు 31,705 ఎకరాలు ఉంది. వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న టెక్కలిలోనే 5,978 ఎకరాల్లో వరి పంటను రైతులు వేయలేకపోయారు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో ఈ ఖరీఫ్‌లో అన్నిరకాల పంటలు కలిపి 4,21,655 ఎకరాల్లో వేస్తారని అంచనా వేయగా 3,80,615 ఎకరాల్లో (90 శాతం) విత్తనాలు వేశారు. ఖరీఫ్‌లో అనుకున్న లక్ష్యంలో మొత్తం 41,040 ఎకరాల మేర తగ్గింది. వరి పంటను 3,87,323 ఎకరాల్లో వేస్తారని లక్ష్యంగా నిర్ణయించగా 3,55,618 ఎకరాల్లో (92 శాతం) సాగవుతున్నట్లుగా నమోదైంది. వరి సాగు 31,705 ఎకరాల మేర తగ్గింది. మొక్కజొన్న పంటను 25,270 ఎకరాల్లో వేస్తారని లక్ష్యంగా నిర్ణయించగా, ప్రస్తుతం 21,798 (86 శాతం) ఎకరాల్లో వేశారు. పత్తి పంటను 3,888 ఎకరాలకు గానూ 1880 ఎకరాల్లో (48 శాతం) వేశారు. మినప పంట 172.5 ఎకరాల్లో సాగు చేస్తారని అంచనా వేయగా, ఇప్పటివరకు 50 ఎకరాల్లో (29 శాతం) వేశారు. పెసర పంట పంట 138 ఎకరాల్లో వేయాలని లక్ష్యంగా నిర్ధేశించుకోగా 48 ఎకరాల్లో (35 శాతం) వేశారు. కంది పంట సాగు మాత్రం నిరాశాజనకంగాఉంది. కంది పంటను 230 ఎకరాల్లో వేయాలని లక్ష్యంగా నిర్ణయించగా, ఇప్పటివరకు కేవలం 10 ఎకరాల్లో (4 శాతం) మాత్రమే వేశారు. వేరుశనగ పంటను 730 ఎకరాల్లో విత్తనాలు వేయాల్సి ఉండగా 270 ఎకరాల్లో (37శాతం) వేశారు. గోగు పంట 142.5 ఎకరాలకు గానూ 7.5 ఎకరాల్లో, చెరకు 3,485 ఎకరాలకు గానూ 908 ఎకరాల్లో వేశారు. ఒక్క ఎకరాలోనూ నువ్వుల విత్తనాలు పడలేదు.

● వంశధార ఆయుకట్టు భూముల్లోనూ తగ్గిన వరి సాగు

వంశధార ఆయుకట్టు పరిధిలోని భూముల్లో సైతం వరి సాగు బాగా తగ్గింది. వంశధార ఎడమ కాలువ పరిధిలో హిరమండలం, జలుమూరు, సారవకోట, నరసన్నపేట, కోటబొమ్మాళి, సంతబొమ్మాళి, టెక్కలి, నందిగాం, పలాస, వజ్రపుకొత్తూరు మండలాలు ఉన్నాయి. వీటిలో ఒక్క మండలంలోనూ వరి పంట సాధారణ సాగు లక్ష్యాన్ని చేరుకోలేదు. పలాస నియోజకవర్గంలోని పలాస, వజ్రపుకొత్తూరు మండలాలు కలిపి మొత్తం 1193 ఎకరాలు తగ్గింది. కుడికాలువ పరిధిలోని హిరమండలం, ఎల్ఎన్‌పేట, సరుబుజ్జిలి, ఆమదాలవలస, శ్రీకాకుళం, గార మండలాలు ఉండగా వీటిలోనూ వరి అసంపూర్ణంగా సాగైంది. ఆమదాలవలసలో సాధారణ సాగు 13040 ఎకరాలు కాగా, ప్రస్తుత ఖరీఫ్‌లో రైతులు 10,753 ఎకరాల్లోనే వరి పంట వేయగలిగారు. ఇక్కడ 2,288 ఎకరాల్లో వరి సాగు తగ్గింది. శ్రీకాకుళం నియోజకవర్గంలోని శ్రీకాకుళంలో గణనీయంగా వరి సాగు తగ్గింది. ఇక్కడ 2,645 ఎకరాలు, గార మండలంలో 1940 ఎకరాల మేర సాగు తగ్గుదల కనిపిస్తోంది.

● వ్యవసాయ మంత్రి అచ్చెన్న నియోజకవర్గంలో అత్యధికం

టెక్కలి నియోజకవర్గంలోని నాలుగు మండలాలు కలిపి మొత్తం 5,978 ఎకరాల్లో రైతులు వరి పంట వేయలేకపోయారు. ఇందులో టెక్కలి మండలంలో వరి సాధారణ సాగు 17,493 ఎకరాలు కాగా 15,190 ఎకరాల్లో మాత్రమే రైతులు విత్తనాలు వేయగలిగారు. జిల్లాలో ఇక్కడ అత్యధికంగా 2303 ఎకరాల మేర వరి సాగు తగ్గింది. కోటబొమ్మాళిలో సాధారణంగా 17,390 ఎకరాల్లో వరి సాగు చేస్తుండగా, ఇక్కడ 15,172 ఎకరాల్లోనే రైతులు పంటలు వేయగలిగారు. నందిగాంలో 743 ఎకరాలు, సంతబొమ్మాళిలో 723 ఎకరాల్లో వరి పంట సాగు తగ్గింది. వంశధార ఆయుకట్టు కింద ఉన్న నాలుగు మండలాల్లో వరి సాగు తగ్గడం గమనార్హం. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత టెక్కలి నియోజకవర్గం పరిధిలోని వంశధార కాలువల్లో పూడిక, జంగిల్ క్లియరెన్స్ కోసం సుమారు రూ.40 లక్షలు ఖర్చు చేసినా రైతులకు మాత్రం సాగు నీరందించలేకపోయారు.

● సాగునీరివ్వడంలో ప్రభుత్వ వైఫల్యం

జిల్లాలో ఈ ఏడాది వర్షాలు కాస్త బాగానే కురిశాయి. జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో సాధారణ వర్షపాతం కంటే అదనంగా 16 శాతం వర్షం పడింది. గతంలో వర్షపాతం లోటు ఉన్న మండలాలు ఏడు, ఎనిమిది వరకు ఉంటే ఈసారి రెండు మాత్రమే ఆ జాబితాలో ఉన్నాయి. జిల్లాలో 17 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదు కాగా 11 మండలాల్లో అధిక వర్షపాతం నమోదైంది. అల్పపీడనాలు, ఒడిశాలో కురిసిన వర్షాలతో జిల్లాలోని బ్యారేజీలు, రిజర్వాయర్లలో నీటి నిల్వలు సమృద్ధిగా ఉన్నా శివారు భూములకు మాత్రం నీరందలేదు. వంశధార కుడి, ఎడమ కాలువల్లో పెద్దఎత్తున గుర్రపుడెక్క, పూడిక పేరుకుపోయింది.

వేసవి సీజన్‌లో పనులు చేపట్టాల్సి ఉన్నా చేయలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత జూలైలో హడావుడిగా టెక్కలి, పలాస నియోజకవర్గాల్లోని కొన్ని ప్రాంతాల్లో జంగిల్ క్లియరెన్స్, పూడిక తొలగింపు చేపట్టారు. కాలువ అంతటా తొలగింపులు విడిచిపెట్టి శివారు ప్రాంతంలో చేపట్టడంతో నీరు శివారు మండలాలకు చేరలేదు. దీంతో హిరమండలం బ్యారేజీలో నీటి నిల్వలు సమృద్ధిగా ఉన్నా నీరివ్వలేని పరిస్థితి నెలకొంది. వంశధార ఆయుకట్టు కింద ఉన్న భూములకు కాలువల ద్వారా నీరివ్వడంలో ప్రభుత్వ వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోంది.

నేడు మన ఇళ్లు.. మన గౌరవం

- వచ్చే ఫిబ్రవరికి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి
- లేకుంటే రద్దు చేస్తాం
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

'మన ఇళ్లు.. మన గౌరవం' కార్యక్రమాన్ని జిల్లావ్యాప్తంగా శనివారం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. జిల్లా, మండలస్థాయి అధికారులతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. 'మన ఇళ్లు.. మన గౌరవం' కిందట ఇప్పటికే ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు వచ్చే ఏడాది ఫిబ్రవరి నెలాఖరులోగా నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. ఒకవేళ పూర్తి చేయకపోతే అవి రద్దవుతాయని స్పష్టం చేశారు. ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయడానికి మండల ప్రత్యేక అధికారులు లబ్ధిదారులతో అవగాహన సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. 28న ప్రతి లేఅవుట్‌లో సమావేశం ఏర్పాటు చేసి లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా సదస్సులకు ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధులు హాజరు కానున్నారని తెలిపారు.

లేఅవుట్ ఇన్‌ఛార్జీలు, హౌసింగ్ ఇంజినీర్లు, సచివాలయ సంక్షేమ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు హాజరు కావాలని ఆదేశించారు. లేఅవుట్‌లో మౌలిక వసతులు కల్పించే విద్యుత్, ఆర్అండ్‌బి, ఆర్‌డబ్ల్యుఎస్, పంచాయతీరాజ్ అధికారులు కూడా భాగస్వాములు కావాలని స్పష్టం చేశారు. ఆ దిశగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని హౌసింగ్ డిఎం బి.నగేష్ ను ఆదేశించారు.

విదేశీ వలస పక్షుల రక్షణకు చర్యలు

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

మండలం లోని తేలుకుంచికి వస్తున్న విదేశీ వలస పక్షుల రక్షణకు చర్యలు చేపడుతున్నట్లు జిల్లా అటవీశాఖ అధికారి వై.సంజయ్ తెలిపారు. జిల్లా అటవీ శాఖ అధికారిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా శుక్రవారం ఇచ్ఛాపురం వచ్చారు. విదేశీ వలస పక్షుల కేంద్రాన్ని సందర్శించి, పక్షుల రక్షణకు సంబంధించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. గ్రామస్తులతో మాట్లాడి పక్షుల గురించి పలు విషయాలను తెలుసుకున్నారు. పక్షుల రక్షణ కేంద్రంలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు అవసరమైన ప్రతిపాదనలు వెంటనే పంపించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు నాయుడు, శ్రీరామ్, బీట్ అధికారులు భానుమూర్తి, జోగారావు, సురేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

సూచనలు చేస్తున్న అటవీశాఖ అధికారి సంజయ్

నియామక పత్రాలను అందజేస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

సమస్యల పరిష్కారానికే పరిష్కార వేదిక

ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి - పలాస

ప్రజల సమస్యలను పరిష్కరించేందుకే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీకోసం) నిర్వహిస్తున్నట్లు ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి తెలిపారు. కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 12 ఫిర్యాదులు వచ్చాయి. ఫిర్యాదులను స్వీకరించిన ఎస్‌పి వారి సమస్యలను విని సానుకూలంగా స్పందించారు. సమస్యలపై పూర్తిస్థాయి విచారణ చేసి పరిష్కరిస్తామని భరోసానిచ్చారు. ప్రజలు వారి సమస్యలను పోలీసుల దృష్టికి తీసుకొస్తే చట్టపరిధిలో పూర్తి విచారణ చేసి త్వరితగతిన పరిష్కారం చూపడానికి చర్యలు తీసుకుంటామన్నారు. పలాస డివిజన్ పోలీస్‌స్టేషన్ల పరిధిలోని ప్రజలు వారి సమస్యలను విన్నవించేందుకు శ్రీకాకుళం రావడం కష్టమవుతుందన్న ఉద్యేంతో తానే ప్రతి శుక్రవారం పలాస వచ్చి ఫిర్యాదులను స్వీకరిస్తున్నట్లు తెలిపారు. తనకు అందిన ప్రతి ఫిర్యాదుపై విచారణ చేసి పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు.

ఫిర్యాదులను స్వీకరిస్తున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

పని సర్దుబాటు ప్రక్రియలను సరిచేయాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఇటీవల చేపట్టిన పని సర్దుబాటు ప్రక్రియలోని అసంగతాలను సరిచేయాలని ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మజ్జి మదన్మోహన్, ఎస్.వి అనిల్ కుమార్ కోరు. ఈమేరకు జిల్లా విద్యాశాఖాధికారి తిరుమల చైతన్యను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. మన బడి-మన భవిష్యత్ కార్యక్రమంలో భాగంగా ఇంకా నిధులు అందాల్సిన పాఠశాలలకు అందజేసి పనులు పూర్తి చేయాలని కోరారు. 2022 వేసవి సెలవుల్లో విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులకు సంపాదిత సెలవు మంజూరు చేయాలని కోరారు. తిత్లీ తుపాను సమయంలో గ్రామస్తులకు భోజనాల కార్యక్రమం నిర్వహించిన ఉపాధ్యాయులకు వాటికి సంబంధించిన ఖర్చులు అందజేయాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాపరిషత్ పిఎఫ్ సెక్షన్‌లో ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని, జెడ్‌పి పిఎఫ్ చందాదారులందరికీ స్లిప్పులను అందజేయాలని కోరారు. ఎపిజిఎల్ఐ కార్యాలయంలో ఉపాధ్యాయుల సమస్యలు పెండింగ్‌లో లేకుండా పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఎపిటిఎఫ్ నాయకులు జి.భీమారావు, బి.బాబూరావు, పి.బాబూరావు తదితరులున్నారు.

డిఇఒకు వినతిపత్రం అందజేస్తున్న ఎపిటిఎఫ్ నాయకులు

ప్రభుత్వ కార్యాలయాల్లో ర్యాంపులు

- ఆర్‌పిడబ్ల్యుడి చట్టంపై అవగాహన అవసరం
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ప్రభుత్వ కార్యాలయాల్లో ర్యాంపుల నిర్మాణం చేపట్టాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. ఆర్‌పిడబ్ల్యుడి చట్టం అమలుపై జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్‌పిడబ్ల్యుడి చట్టంపై అందరికీ అవగాహన అవసరమన్నారు. జిల్లాలో సీనియర్ సిటిజన్ చట్టం అమలు గురించి సీనియర్ సిటిజన్ సంఘ నాయకులను అడిగి తెలుసుకున్నారు. ఈ చట్టం అమలుపై ప్రతి పిహెచ్‌సి, సిహెచ్‌సిలో అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాలో వృద్ధాశ్రమాల ఏర్పాటుకు సంబంధించి చర్యలు చేపట్టాలన్నారు. పలు ప్రభుత్వ శాఖల్లో స్పెషల్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ కింద నాలుగు శాతం బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయనున్నట్లు చెప్పారు. సామాజిక భద్రతా పింఛన్లు డిఆర్‌డిఎ ద్వారా డిఫరెంట్లీబుల్డ్, ట్రాన్స్‌జెండర్, సీనియర్ సిటిజన్లకు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు మాట్లాడుతూ జిల్లాలో ఈ చట్టంపై అవగాహన కల్పించడంలో వెనుకబడి ఉన్నామన్నారు. సమాజంలో మార్పు రావాలంటే ప్రజల్లో ఆలోచనా విధానం మారాలన్నారు. జిల్లాలో వృద్ధాశ్రమాలు ఏవీ రిజిస్ట్రేషన్ కాలేదన్నారు. వికలాంగుల్లో రెండు మూడు అసోసియేషన్లు ఒక యూనిటీగా ఏర్పడాలన్నారు.

సీనియర్ సిటిజన్లకు ఒక భవనం మంజూరు చేయాలని, ఆర్‌టిసి, ఆలయాల్లో ప్రత్యేకంగా క్యూలైన్ ఏర్పాటు చేయాలని సమావేశంలో పలువురు కోరారు. వయోవృద్ధులు, వికలాంగుల వాహనాలకు ప్రత్యేక పార్కింగ్ ఏర్పాటు చేయాలని కోరగా, ప్రత్యేక పార్కింగ్ ఏర్పాటుతో పాటు డిస్‌ప్లే బోర్డుల ఏర్పాటుకు సత్వర చర్యలు చేపట్టాలని ఆర్‌టిసి అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో వికలాంగులు పక్క జిల్లాలకు వెళ్లి చదువుకుంటున్నారని ఇక్కడ పాఠశాల ఏర్పాటు, కళ్యాణ మండపం మంజూరు, యుడిఐ కార్డులు అందేలా చర్యలు చేపట్టాలని పలువురు వికలాంగులు కోరారు. సామాజిక వికలాంగుల భవనం మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ వికలాంగులకు నిర్వహించిన జాబ్‌మేళాలో ఎంపికైన వారికి నియామక పత్రాలను కలెక్టర్ అందజేశారు. సంజ్ఞ భాష పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో జిల్లా వికలాంగుల శాఖ సహాయ సంచాలకులు కవిత, డిపిఒ వెంకటేశ్వరరావు, జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకట్రామన్, ఆర్అండ్‌బి ఎస్ఇ జాన్ సుధాకర్, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి, జిజిహెచ్ సూపరింటెండెంట్ షకీలా, డిసిహెచ్ఎస్ కళ్యాణ్ బాబు, బిసి కార్పొరేషన్ ఇడి గడ్డెమ్మ, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి సాయికుమార్ పలువురు అధికారులు, స్వచ్ఛంద, వికలాంగ, సీనియర్ సిటిజన్ సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ప్రసాదాల తయారీ పరిశీలన

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో తయారు చేస్తున్న ప్రసాదాల ముడి సరుకుల నాణ్యతను జిల్లా ఆహార కల్తీ నియంత్రణాధికారి కె.వెంకటరత్నం శుక్రవారం తనిఖీ చేశారు. అరసవల్లి గోదాములో ఉన్న నిల్వలను తనిఖీ చేసి నాణ్యతను పరిశీలించారు. పులి హోరా ప్రసాదానికి వాడే దినుసులు, నూనె, బియ్యం, చింతపండు, లడ్డూ తయారీకి వాడే శనగపిండి, నెయ్యి, జీడి పప్పు, సుగంధ ద్రవ్యాలు పరిశీలించి శాంపిల్స్‌ను సేకరించారు. తయారీ సమయంలో వ్యక్తిగత, పరిసరాల శుభ్రతను పాటించాలని సూచించారు. ప్రయోగశాలకు పంపించిన శాంపిల్స్ నివేదికలు వచ్చిన తర్వాత తేడాలు ఉంటే చర్యలు తీసుకుంటామన్నారు. తనిఖీల్లో సహాయ ఆహార కల్తీ నియంత్రణాధికారి లక్ష్మి పాల్గొన్నారు.

నాణ్యతను పరిశీలిస్తున్న ఆహార కల్తీ నియంత్రణాధికారులు

డ్వామా పీడీ సుధాకర్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులుగా బి.సుధాకర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. విజయనగరం మెప్మా పీడీగా పనిచేసిన ఆయన్ను డ్వామా పీడీగా ప్రభుత్వం నియమించింది. బాధ్యతలు స్వీకరణ అనంతరం ఆయన్ను డ్వామా విజిలెన్స్ అధికారి బి.లవరాజు, ఫైనాన్స్ మేనేజర్ స్వరూపరాణి, కార్యక్రమ అధికారి కె.వి అప్పలనాయుడు, క్వాలిటీ కంట్రోల్ అధికారి వి.సతీష్‌బాబు, టెక్నికల్ అసిస్టెంట్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు వై.వి రమణ, జి.రామచంద్రరావు, ఎపిఒలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఇప్పటివరకు పీడీగా పనిచేసిన జి.వి చిట్టిరాజు పలాస డిఎల్‌డిఒగా బదిలీ అయ్యారు.

ఆరోగ్యకర సమాజం అందరి బాధ్యత

ప్రజాశక్తి - శ్రీకాకుళం

వ్యసన విముక్తి శ్రీకాకుళం కోసం రోడ్డు ప్రమాదాల నివారణకు అందరూ కలసికట్టుగా కృషి చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పిలుపునిచ్చారు. జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో ఆర్ఎస్‌పి ఫౌండేషన్, యునైటెడ్ ఎన్‌జిఒస్ ఆధ్వర్యాన అక్టోబరు ఒకటో తేదీన ఏర్పాటు చేసిన వరల్డ్ మెంటల్ హెల్త్ డే పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛ శ్రీకాకుళం సాధన అందరి కర్తవ్యమన్నారు. ఆర్ఎస్‌పి ఫౌండేషన్ ఆధ్వర్యాన వచ్చే నెల ఒకటో తేదీన శ్రీకాకుళం నగరంలో పెద్దఎత్తున ఏర్పాటు చేసిన ర్యాలీ, అవగాహనా సదస్సును విజయవంతం చేసేందుకు సంపూర్ణ సహకారాన్ని అందిస్తామని హామీనిచ్చారు. ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మానసిక ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయొద్దని సూచించారు. సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణలో యునైటెడ్ ఎన్‌జిఒస్ ఫోరం చేస్తున్న కృషి మరువరానిదని కొనియాడారు. కార్యక్రమంలో ఎన్‌జిఒస్ ఫోరం ప్రతినిధులు పొన్నాడ రాజశేఖర్, ఎస్.జోగి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వికలాంగుల గ్రీవెన్స్‌కు 41 వినతులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

అంగవైకల్యం ఉన్నతికి అడ్డం కారాదని, ప్రతిఒక్కరూ మంచి ఆలోచనలతో కష్ట పడి ఉన్నతి శిఖరాలను అందిపుచ్చుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సూచించారు. జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన వికలాంగుల గ్రీవెన్స్ (స్వాభిమాన్)లో జిల్లా రెవెన్యూ అధికారి అప్పారావు, వికలాంగుల శాఖ ఎడి కె.కవితతో కలిసి వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి వికలాంగుల నుంచి పలు సమస్యలపై 41 వినతులు వచ్చాయి. ప్రతి వినతిని సంబంధిత శాఖల ఉన్నతాధికారులు వ్యక్తిగతంగా పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. వికలాంగులు ఆర్‌టిసి బస్సుల్లో సులువుగా ప్రయాణించేందుకు మెరుగైన సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఎచ్చెర్ల మండలం ఫరీదుపేటకు చెందిన సువ్వారి రవిబాబు వికలాంగుల పెన్షన్ మంజూరు చేయాలని కోరారు. నిరుపేద కుటుంబమే అయినా అంత్యోదయ కార్డు మంజూరు చేయలేదన్నారు. మూడు చక్రాల వాహనం మంజూరు చేయాలని, తన తల్లికి వితంతువు పెన్షన్ మంజూరు చేయాలని కోరారు. లావేరుకు చెందిన బారుకుల అప్పన్న సదరం ఐడి నెంబర్ డిలీట్ చేసి కొత్త సర్టిఫికెట్ మంజూరు చేయాలని కోరారు.

వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పర్యాటకానికి పెరుగుతున్న ఆదరణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ప్రపంచవ్యాప్తంగా పర్యాటక రంగానికి ప్రజాదరణ పెరుగుతోందని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు అన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని చరిత్ర - టూరిజం అంశంపై కళాశాలలో శుక్రవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చరిత్రను తెలుసుకోవాలన్న ఆలోచన, వినోదాన్ని పొందడానికి అనువైన వనరులు దాగి ఉన్నాయన్నారు. ప్రతిఒక్కరూ ఆనందంగా బతకడానికి విద్యతో పాటు వినోదం అవసరమన్నారు. పర్యాటక రంగం ద్వారా వినోదం సాధ్యమవుతుందన్నారు. సెట్‌శ్రీ సిఇఒ ప్రసాదరావు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా పర్యాటక రంగానికి ప్రాదాన్యత పెరుగుతోందన్నారు. టెంపుల్ టూరిజం, ఎకోటూరిజం, ఆర్కియాలజీ, సముద్ర తీర ప్రాంతాలు వంటివి అభివృద్ధి చెందుతున్నాయన్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో టూరిజం కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ఇన్‌టాక్ సంస్థ మాజీ కన్వీనర్ రాధాప్రసాద్ మాట్లాడుతూ పర్యాటక ప్రాంతాల అభివృద్ధి వల్ల విభిన్న సంస్కృతి సంప్రదాయాలు ప్రపంచానికి పరిచయమయ్యాయన్నారు. సదస్సు అనంతరం థింసా, ఇతర సంప్రదాయ నృత్యాలను విద్యార్థినులు ప్రదర్శించారు. కళాశాల చరిత్ర విభాగాధిపతి డాక్టర్ ఎన్.చిన్నారావు అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో నటుకుల మోహన్, కళాశాల వైస్ ప్రిన్సిపల్ పి.శంకరనారాయణ, అకడమిక్ కోఆర్డినేటర్ సిహెచ్.కృష్ణారావు, ఐక్యుఎసి కోఆర్డినేటర్ ఎస్.పద్మావతి, ఎం.జోగినాయుడు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సూర్యచంద్రరావు

డ్వాక్రా బజార్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శిరీష

డ్వాక్రా సంఘాల బలోపేతానికి కృషి

ప్రజాశక్తి- పలాస

మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించాలని, డ్వాక్రా సంఘాల బలోపేతానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. కాశీబుగ్గ పాత టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ వద్ద మెప్మా ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన డ్వాక్రాబజార్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మహిళా సంఘాలకు చేయూత నిస్తుందని డ్వాక్రా మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం డ్వాక్రా సంఘాలు తయారు చేసిన ఉత్పత్తులను పరిశీలించారు. డ్వాక్రా మహిళలు మాట్లాడుతూ తాము తయారు చేసిన ఉత్పత్తులకు మార్కెట్ సదుపాయం కల్పించాలని, డ్వాక్రా బజార్ కోసం స్థలం మంజూరు చేయాలని విజ్ఞప్తి చేయగా, అందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, బడ్డ నాగరాజు, సప్ప నవీన్, సత్యం, రామకృష్ణ, గొళ్ల చంద్రరరావు, సవర రాంబాబు, నాబెల్లి శ్రీను, మెప్మా అధికారులు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

పాఠశాల మైదానాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శంకర్

జాతర ఏర్పాట్లు పరిశీలన

కోటబొమ్మాళి: అక్టోబర్ 1 నుంచి 3 వరకు జరగనున్న కోటబొమ్మాళి శ్రీ కొత్తమ్మతల్లి జాతర ఉత్సవాల ఏర్పాట్లును శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ శుక్రవారం రాష్ట్ర టిడిపి కార్యదర్శి బోయిన గోవిందరాజులు, మండల పార్టీ అధ్యక్షుడు బోయిన రమేష్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి కబాడీ, సంగిడీలు, ఉలవల బస్తాల పోటీల నిర్వహణకు సంబంధించి జిల్లా పరిషత్ పాఠశాల మైదానాన్ని పరిశీలించారు. పాఠశాల మైదానం బురదమయంగా ఉండడంతో ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఎలా నిర్వహిస్తారని నిర్వాహకులు అడిగి తెలుసుకున్నారు. జాతరకు వచ్చే యాత్రికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఈయనతో పాటు టిడిపి నాయకులు కోరాడ గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

ఆటపాటలతో విద్య

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రతి పాఠశాలలో విద్యార్థులకు ఆట, పాట, మాటలతోనే నిత్యం విద్య అభ్యసించాలని పాఠశాల సంసిద్ధతా కార్యక్రమం కో-ఆర్డినేటర్ ఎస్.సత్యనారాయణ, వి.కామునాయుడు అన్నారు. బెజ్జిపురం యూత్‌క్లబ్ ప్రాజెక్టు డైరెక్టర్ మేడూరి ప్రసాద్ ఆధ్వర్యాన ఇండియా లిటరసీ ప్రాజెక్ట్, బెజ్జిపురం యూత్ క్లబ్ రెండు రోజుల పాటు గార మండలం, ఎచ్చెర్ల మండలం, శ్రీకాకుళం రూరల్ మండలాల్లో ఉపాధ్యాయులకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా శుక్రవారం శిక్షణా కార్యక్రమంలో ఆడవరం ఉపాధ్యాయులు భోగెల ఉమామహేశ్వరారావు బడికి పోదాం పాట పాడారు. కార్యక్రమంలో చూపుడు వేలు, బంతి బంతి, గాంధీ తాత, ఆరోగ్యం మహాభాగ్యం, మూఢనమ్మకాలు, అక్షర వర్ణమాలపైన నృత్యాలు చేస్తూ అందించిన శిక్షణ ఉపాధ్యాయులను ఆకట్టుకుంది. యూత్ క్లబ్ కో-ఆర్డినేటర్లు కమలమ్మ, ఉమా మహేశ్వరరావు, కమ్యూనిటీ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ మాధవి, కమ్యూనిటీ ఆర్గనైజేషన్ ఉమామహేశ్వరరావు, శంకర్, మెహర్‌వాణి, సంతోషి, హేమసుందర్, రవణమూర్తి, నరసింహ చౌదరి, విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

చీఫ్ ఇంజినీర్‌కు వినతిపత్రం అందజేస్తున్న శ్యామ్‌ప్రసాద్ రెడ్డి

బాహుదాపై వంతెన నిర్మాణానికి వినతి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

బాహుదానదిపై ప్రజా సౌకర్యం కోసం నూతన బ్రిడ్జి నిర్మించాలని ఆర్అండ్‌బి ఇంజినీర్ ఇన్ చీఫ్ నయిముల్లాను సీడాప్ మాజీ చైర్మన్ సాడి శ్యాంప్రసాద్ రెడ్డి శుక్రవారం విజయవాడలో కలిసి వినతిపత్రం అందించారు. త్వరగా బ్రిడ్జి నిర్మాణం పనులు చేపట్టాలని కోరారు. బ్రిటిష్ కాలంనాటి వంతెన ఏడాది క్రితం కూలిపోవడంతో ఆ బ్రిడ్జికి తాత్కాలిక మరమ్మతులు చేసి కార్లు, ఆటోలు, ద్విచక్రవాహనాలకు మాత్రమే అనుమతి ఇవ్వటంతో ప్రజలు, విద్యార్థులను అత్యవసర పరిస్థితుల్లో ఆస్పత్రికి తరలించే రోగులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ తాత్కాలిక మరమ్మత్తుల వలన బ్రిడ్జి ఇంటిగ్రేట్ (సమగ్రత) తక్కువగా ఉండటం వలన ఇది ప్రజాసౌకర్యార్థం అంత మంచిది కాదని తెలిపారు. నూతన బ్రిడ్జి నిర్మాణం చేపడితే ప్రజల సామాజిక, వ్యాపార, వ్యవసాయ, విద్య, వైద్య రంగాలకు ఉపయోగం జరుగుతుందన్నారు.

డిప్లమో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

పీజీ డిప్లొమో ఇన్ గాంధీయాన్ సోషల్ వర్క్ కోర్సులో ఈ ఏడాది ప్రవేశాలకు డా. బి.ఆర్. అంబేద్కర్ విశ్వవిద్యాలయం దరఖాస్తులను ఆహ్వానిస్తుంది. ఒక ఏడాది వ్యవధిగల ఈ కోర్సులో చేరేందుకు ఏదైనా డిగ్రీ పూర్తిచేసిన వారు అర్హులని, దరఖాస్తులను యూనివర్శిటీ వెబ్‌సైట్ నుంచి పొందవచ్చునని రిజిస్ట్రార్ ఆచార్య పి.సుజాత తెలిపారు. కోర్సులో చేరాలనుకునే వారు రూ.200 అప్లికేషన్ ఫీజుతో పాటు రూ.2,500 ట్యూషన్ ఫీజును 'రిజిస్ట్రార్, డా.బిఆర్ఎయూ పేరిట తీసిన డిమాండ్ డ్రాఫ్ట్ రూపాన దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను అక్టోబర్ 5లోగా, రూ.500 అపరాధ రుసుంతో అక్టోబర్ 15లోగా వర్శిటీలోని సోషల్ వర్క్ విభాగంలో అందజేయాలన్నారు. ఈ కోర్సు పూర్తిచేసిన వారు పలు ఎన్‌జిఒ, మీడియా సంస్థలతో పాటు గ్రామీణాభివృద్ధి శాఖ, ఆరోగ్య సంబంధిత ప్రాజెక్టులు, కౌన్సెలింగ్ సెంటర్లు, సామాజిక అధ్యయన కేంద్రాల్లో ఉపాధి పొందేందుకు అర్హులన్నారు. మరిన్ని వివరాలకు సోషల్ వర్క్ విభాగాధిపతి డా. యు. కావ్య జోత్స్న 9494520417, 6304520703 నెంబరులకు సంప్రదించాలని, వర్శిటీ వెబ్‌సైట్ www.drbrau.edu.in ద్వారా తెలుసుకోవచ్చునన్నారు.

30న సదస్సు

టెక్కలి: ఎస్‌సి, ఎస్‌టి వర్గీకరిస్తూ సుప్రీంకోర్టు తీర్పును పున:సమీక్షించాలని కోరుతూ ఈ నెల 30న స్థానిక ఆదిత్యా కళ్యాణ మండపంలో సదస్సు నిర్వహించనున్నామని ఎస్‌సి, ఎస్‌టి వర్గీకరణ వ్యతిరేక పోరాటసమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బోకర నారాయణరావు, చల్లా రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సుకు మాజీ ఎంపి హర్షకుమార్ హాజరు కానున్నారని తెలిపారు. ఈ సదస్సులో ఆదివాసీలు, దళితులు, ప్రజా సంఘాలు, దళిత సంఘాలకు చెందిన వారు హాజరు కావాలని కోరారు. ఈ సందర్భంగా పోస్టర్‌ను ఆవిష్కరించారు. వీరితో పాటు దళిత నాయకులు కురమాన దాలయ్య, దూసి ఆంధ్రాస్టాలిన్, కుప్పిలి కామేశ్వరరావు, జె.బాబురావు, వై.గడ్డెయ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి- పోలాకి

సంక్షేమం, అభివృద్ధి కూటమి ప్రభుత్వానికి రెండు కళ్లని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. శుక్రవారం వనితమండలం గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం మంచి పాలన అందిస్తుందన్నారు. వందరోజుల పాలనలో సిఎం చంద్రబాబు అనేక సంక్షేమ పథకాలతో ప్రజలచే ఇది మంచి ప్రభుత్వం అని అనిపించుకుంటుందన్నారు. అలాగే వనిత మండలం రోడ్డుకు రూ.1.27 లక్షలు మంజూరు చేశామని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి ఆర్.మురళీధర్, మండల పార్టీ అధ్యక్షులు మిరియాపల్లి వెంకటప్పలనాయుడు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ భైరి భాస్కరరావు, జిల్లా లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి రోణంకి కృష్ణనాయుడు, మాజీ సర్పంచ్ రాంబాబు, ఈశ్వరరావు, రమేష్, అధికారులు పాల్గొన్నారు.

లావేరు: లావేరు పంచాయతీ కేశవరాయనిపురంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటి ఇంటికి వెళ్లి స్టిక్కర్లు అంటించారు. కార్యక్రమంలో ఎఎంసి మాజీ చైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర, కూటమి నాయకులు గురిజా శ్రీనువాసరావు, మాజీ ఉప సర్పంచ్ ఉప్పాడ గొల్ల, గురిజా సురేష్, కాకి అప్పన్న, యినపకుర్తి మహేష్, దీపల్లి రామారావు, పైడి రాజు తదితరులు పాల్గొన్నారు.

పోలాకి : స్టిక్కర్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

పాతపట్నం: మండలం తెంబూరులమిది మన మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని టిడిపి నాయకులు నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, జరిగిన అభివృద్ధిపై ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు కాకర్ల మల్లేశ్వరరావు, కాకర్ల వెంకటరమణ, నందాన శ్రీనివాసరావు, జిల్లా పరిషత్ స్కూల్ చైర్మన్ కాకర్ల నాగేశ్వరరావు, సచివాలయ సిబ్బంది, స్థానిక టిడిపి కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

టెక్కలి ఆర్‌డిఒగా కృష్ణమూర్తి

టెక్కలి: టెక్కలి సబ్‌కలెక్టర్ కార్యాలయానికి ఆర్‌డిఒగా ఎం.మురళీకృష్ణను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఈయన విజయవాడలో శిక్షణ పొందు తున్నారు. ప్రస్తుత ఆర్‌డిఒ సుదర్శన దొరను జిఎడికి పంపనున్నారు.

ఆర్‌డిఒకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

ఆర్‌డిఒకు రైతుల వినతి

సోంపేట : పలాస ఆర్‌డిఒ భరత్ కుమార్‌కు కొర్లం అగ్రహారం చెరువు ఆయకట్టు రైతులు శుక్రవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వంశ పారంపర్యంగా తమకు సంక్రమించిన భూములు రిజిస్ట్రేషన్లు కాకుండా, అడంగల్ కాపీలు మంజూరు చేయకుండా నిలుపుదల చేయడం జరిగిందన్నారు. విచారణ చేసి తమకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో రామ్‌బుడ్డి గణపతి, సంగారు ఢిల్లీరావు, పి సోమేశ్వరరావు, ఆర్.జానకిరావు, పి.బాబురావు, బి.ఢిల్లీరావు, ఎం.షణ్ముకరావు, జోగారావు, సుధాకర్, ఎస్ రామస్వామి, శ్రీను పాల్గొన్నారు.

నేడు రేషన్ డీలర్ల సమావేశం

లావేరు : స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో శనివారం ఉదయం పదిన్నర గంటలకు రేషన్ డీలర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్టు తహశీల్దార్ ఎన్ని జోగారావు తెలిపారు. ఈ సమావేశానికి మండలంలో ఉన్న రేషన్ డీలర్లందరూ తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. రేషన్‌షాపుల విభజన, కొత్త దుకాణాల ఏర్పాటు పౌర సరఫరాల ఉపతహశీల్దార్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమావేశానికి ప్రతి డీలర్ తమకు చెందిన దుకాణం కార్డులు, వివరాలు, ఇతర రికార్డులతో హాజరు కావాలన్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం

పాతపట్నం : పాతపట్నం, హిరమండలం, సారవకోట మండలాల్లో పారాలీగల్ వలంటీర్లుగా పని చేయడానికి ఆసక్తి గల పదవ తరగతి పాసైన వారు దరఖాస్తు చేసుకోవచ్చునని జూనియర్ సివిల్ జడ్జి ఎం.రోషిణి ఒక ప్రకటనలో తెలిపారు. అంగన్వాడీ కార్యకర్తలు, వైద్యులు, ప్రభుత్వ సర్వెంట్లు, విశ్రాంత ఉద్యోగులు, విద్యార్థులు ఈ పారాలీగల్ వలంటీర్లకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అక్టోబర్ 10లోగా దరఖాస్తు చేసుకోవచ్చని, ఎటువంటి జీతం ఉండదని, స్వచ్ఛందంగా పని చేయడానికి ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మరిన్ని వివరాలకు కోర్టు ఆవరణలో మండల న్యాయసమితిని సంప్రదించాలన్నారు.

హిందీ భాషను విస్తరించాలి

టెక్కలి: జాతీయ భాషగా గుర్తింపు పొందిన హిందీ భాషను విస్తరించాల్సిన అవసరం ఉందని చాకిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం ఎం.అనురాధ అన్నారు. హిందీ పక్షోత్సవాలు ముగింపు కార్యక్రమం శుక్రవారం పాఠశాల ఆవరణలో చేపట్టారు. హిందీ భాషోపాధ్యాయులు తమ్మినేని వైకుంఠరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో భాషా ఔన్నత్యాన్ని వివరించారు. ఈ సందర్భంగా హిందీ భాషపై విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులను హెచ్ఎం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పొట్నూరు జగదీష్, కురమాన దాలయ్య, భారతి, నారాయణరావు, ఆనందరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

30లోగా పంట నమోదు

మెళియాపుట్టి : రైతులు ఖరీఫ్‌లో పండిస్తున్న అన్ని రకాల పంటలకు రైతు సేవా కేంద్రంలో ఈ నెల 30లోగా పంట నమోదు చేసుకోవాలని ఎఒ దానకర్ణుడు తెలిపారు. రైతులు బయోమెట్రిక్ వేసి తాము పంట నమోదు చేసుకున్న పంటలకు ఇకెవైసి చేసుకోవాలన్నారు. పంట నమోదు చేసుకున్న రైతులకు మాత్రమే ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని పథకాలు వర్తిస్తాయన్నారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

ఉపాధ్యాయుల ఆర్థికసాయం

కోటబొమ్మాళి: మండలంలోని తిలారు మండల పరిషత్ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు విజయవాడ వరద బాధితులకు మాజీ ఎంపిపి తర్ర రామకృష్ణ చేతులమీదుగా రాష్ట్ర వ్యవసాయశాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకు నిమ్మాడ మంత్రి క్యాంపు కార్యాలయంలో రూ. 15వేలు నగదును అందజేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్తుల సహకారంతో ఈ మొత్తాన్ని అందించినట్టు ఉపాధ్యాయులు తెలిపారు.

వసతిగృహాలు పరిశీలన

టెక్కలి : పట్టణంలోని పలు వసతి గృహాలను టెక్కలి జూనియర్ సివిల్ జడ్జి జె.శ్రీనివాసరావు హైకోర్టు ఆదేశాల మేరకు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వసతి గృహాల్లో ఉన్న విద్యార్థులతో మాట్లాడారు. వసతిగృహంలో అందు తున్న సౌకర్యాలు, భోజన సదుపాయాలు, విద్య, తదితర అంశాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ మెనూ ప్రకారం ఉన్న సౌకర్యాలపై ఆరా తీశారు. వసతి గృహాల్లో వంటగదులు, పరిసరాలు, విద్యార్థులు నివసిస్తున్న గదులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. సందేహాలను నివృత్తి చేసేందుకు ట్యూటర్‌లను నియమించాలని విద్యార్థులు కోరారు. ఈయనతో పాటు ఆయా వసతి గృహాల వార్డెన్లు ఉన్నారు.

సరుకుల నాణ్యతను పరిశీలిస్తున్న జడ్జి

సాదాసీదాగా మండల సమావేశం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి బోర పుష్ప అధ్యక్షతన శుక్రవారం మండల సాధారణ సమావేశం నిర్వహించారు. పలు సమస్యలను ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. తేలుకుంచి గ్రామం నడి బొడ్డున శిధిలావస్థలో ఉన్న నీటి సరఫరా ట్యాంక్‌ను తక్షణమే తొలగించాలని సర్పంచ్ పి.రాజశేఖర రెడ్డి అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. శిధిలావస్థలో ఉన్న ట్యాంక్‌ను తొలిగించాలని ఎప్పటినుంచో కోరుతున్నప్పటికీ అధికారులు స్పందించడం లేదని, ఏదైనా జరగరాని ఘటన జరిగి ట్యాంక్ కూలితే పెద్ద ప్రమాదం జరుగుతుందన్నారు. కొత్త ట్యాంక్ నిర్మాణం పూర్తి చేసినా దానికి నీరు మళ్లించకుండా శిధిలావస్థలో ఉన్న ట్యాంక్ ద్వారానే నీటిని సరఫరా చేయడంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని గ్రామస్తులు భయపడుతున్నారన్నారు. దీనిపై సర్పంచ్ లిఖిత పూర్వకంగా ఎంపిడిఒ రామారావుకు వినతిపత్రం అందించారు. దీనిపై సంబంధిత గ్రామీణ నీటి సరఫరా ఇంజినీర్ విష్ణు సమాధానమిస్తూ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి ట్యాంక్ తొలగించే చర్యలు తీసుకుంటామన్నారు. వ్యవసాయ శాఖాధికారి భార్గవి మాట్లాడుతూ ఈ నెలాఖరులోగా ఇకెవైసి పూర్తి

ఎంపిడిఒకు వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్

చేసుకోవాలని, ఇప్పటివరకు మండలంలో 85 శాతం పూర్తయిందన్నారు. జలజీవన్ మిషన్ ద్వారా కేసుపురం గ్రామంలో పూర్తిస్థాయిలో నీటిని సరఫరా చేయడం లేదని దున్న గురుమూర్తి గ్రామీణ నీటి సరఫరా అధికారిని ప్రశ్నించారు. కిడ్నీ ప్రభావిత ప్రాంతమైన తమ గ్రామంలో నీటిని సరఫరా చేయకపోవడం శోచనీయమన్నారు. గత నాలుగు సమావేశాల నుంచి కూడా పశువైద్యాధికారి హాజరుకావడం లేదని ఈదుపురం సర్పంచ్ నర్తు వరప్రసాద్ ఎంపిడిఒ దృష్టికి తీసుకువచ్చారు. బాహుదా నదిపై ఉన్న 11 ఓపెన్ హెడ్ ఛానల్‌కు విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేయాలని మాజీ ఎంపిపి, బిర్లంగి ఎంపిటిసి దక్కత ఏకాంభరి దేవి కోరారు. సమావేశంలో జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న హమాలీలు

కూలి రేట్ల జిఒ అమలు చేయాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్ర పౌరసరఫరాల విభాగాల్లో పని చేస్తున్న హమాలీల కూలి రేట్లు పెంచుతూ విడుదల చేసిన ఒప్పంద జిఒను తక్షణమే అమలు చేయాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి అనపాన షణ్ముఖరావు డిమాండ్ చేశారు. అరసవల్లి సివిల్ సప్లై గోడౌన్ వద్ద ఎపిసివిల్ సప్లై హమాలీ కార్మిక సంఘం పిలుపు మేరకు శుక్రవారం ధర్నా చేపట్టారు. ఈ ధర్నాలో ఆయన మాట్లాడుతూ రెండేళ్లకు ఒకసారి కూలీ రేట్ల అగ్రిమెంట్ సివిల్ సప్లై డిపార్టుమెంట్ కార్మిక సంఘాలతో కలిపి కూలీ రేట్లు నిర్ణయిస్తారని, జనవరి నెలతో పాత ఒప్పందం ముగిసినప్పటికీ యాజమాన్యం పెరిగిన ధరలకు అనుగుణంగా కూలీ రేట్లు పెంచకుండా వెట్టి చాకిరీ చేయిస్తోందన్నారు. ఇఎస్ఐ, పిఎఫ్ కార్మికులందరికీ వర్తింప చేయాలని కోరారు. హమాలీలు ప్రమాదాల వలన మరణించినా, పూర్తిస్థాయి అంగవైకల్యం పొందినా రూ.పది లక్షలు పరిహారం ఇవ్వాలని, సహజ మరణం పొందిన కార్మికుని కుటుంబానికి రూ.ఐదు లక్షలు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షులు చిక్కాల గోవిందరావు, జిల్లా అధ్యక్షులు కె.శ్రీమన్నారాయణ, సాధు అసిరినాయుడు, నక్క నర్సింహులు, బొమ్మాళి రామకృష్ణ, బూరగాపు మహేష్, భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఉప్పాడ సూర్యనారాయణ, ఆటోవర్కర్స్ యూనియన్ నాయకులు చుక్క రాము తదితరులు పాల్గొన్నారు.

మాతాశిశు సంపూర్ణ ఆరోగ్య రక్షణే లక్ష్యం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్, గార

మాతా, శిశుసంపూర్ణ ఆరోగ్య రక్షణే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు వెళ్తుందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. మండలంలోని గార ఐసిడిఎస్ భవనంలో నిర్వహించిన పోషణ అభిమాన్ మాసోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐసిడిఎస్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ మొదటి వారం నుంచి చివరి వారం వరకు కార్యక్రమం కొనసాగిస్తోందన్నారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన ఆహారం, చిన్నారుల ఆరోగ్య పరిస్థితులపై అధికారులు, ఐసిడిఎస్ సిబ్బంది ప్రచారం నిర్వహిస్తాం న్నారు. వివిధ శాఖల సమన్వయంతో పోషకాహారంపై అవగాహన, చిన్నారులకు అన్నప్రాసన, సీమంతాలు, అక్షరాభ్యాసం, గర్భిణుల నమోదుతో పాటు పరీక్షలు, వైద్య శిబిరాల నిర్వహణ వంటి కార్యక్రమాలు చేపడుతున్నామని వివరించారు. చిన్నారులు ఆకుకూరలు అధికంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టిడిపి మండల నాయకులు, కార్యకర్తలు, ఐసిడిఎస్ అధికారులు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

అలాగే నగరంలోని కృష్ణా పార్కు వద్ద గల అంగన్వాడీ కేంద్రాల్లో పోషకాహార మాసోత్సవాలను నిర్వహించారు. నగరంలోని దూదివారి సందు, తుమ్మవీధి, కత్తెర వీధి, కొన్నవీధి, బర్మా కాలనీ, గారవీధి, రైతుబజారు అంగన్వాడీ కేంద్రాల్లో పోషకాహార మాసోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ పిఒ శోభారాణి, సూపర్ వైజర్లు పి.సీతామహాలక్ష్మి, టిడిపి వార్డు ఇన్‌ఛార్జి ఇప్పిలి తిరుమలరావు, హిమబిందు, ఆశ శశికళ, అంగన్వాడీ కార్యకర్తలు ఆదిలక్ష్మి, సంధ్యారాణి, నీలవేణి, ఇందిర, ప్రసన్న, సునీత, హైమ, అరుం, విజయనిర్మల పాల్గొన్నారు.

పిల్లల ప్రవర్తనపై నిశిత పరిశీలన అవసరం

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డిఎస్‌పి వివేకానంద

శ్రీకాకుళం అర్బన్: పోటీ ప్రపంచంలో తల్లిదండ్రులకు, పిల్లలకు మధ్య అనుబంధం కొరవడుతోందని, పిల్లల ప్రవర్తను నిశితంగా పరిశీలించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని డిఎస్‌పి సిహెచ్ వివేకానంద అన్నారు. శుక్రవారం బాపూజీ కళామందిర్‌లో బాలు స్వనీరాజనం-4 కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వర్ధనమాన గాయకులు తమ పాటలతో ఆహూతులను అలరించారు. ఈ సందర్భంగా హాజరైన డిఎస్‌పి మాట్లాడుతూ సెల్‌ఫోన్ ద్వారా జ్ఞానాన్ని పెంపొందించు కోవాలని, పిల్లలు సెల్‌ఫోన్‌కు దాసోహమవుతున్నారని, దీనివలన అనేక అనర్థాలు ఉత్పన్నమవుతున్నాయన్నారు. పిల్లల ప్రవర్తనలో వస్తున్న మార్పులను గమనించాలంటే వారిపై శ్రద్ధ వహించాలన్నారు. తల్లిదండ్రులు, పిల్లల మధ్య బంధం తెగిపోతుందని, విద్యార్థులు ఒంటరిగా గదుల్లో కంప్యూటర్లను, ల్యాప్‌ట్యాప్‌లకు అతుక్కుపోతున్నారని, పిల్లల ఆలోచనల్లో మార్పు తీసుకురావాలన్నారు. అనంతరం అక్టోబరు 1న వరల్డ్ మెంటల్ హెల్త్ డేను పురష్కరించుకొని నిర్వహించనున్న కలిసి నడుద్దాం, మనసుని జయద్దాం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం బాలు స్వర నీరాజనం-4 సందర్భంగా నిర్వహించిన పాటల పోటీల్లో ప్రథమ బహుమతి భవ్య, ద్వితీయ బహుమతి చంటి, తృతీయ బహుమతి ఛార్మిలకు అందజేశారు. జామి భీమ శంకర్, నటుకుల మోహన్, శాసపు జోగినాయుడు, న్యూబ్లడ్ బ్యాంక్ మేనేజర్ మణికంఠ, దూసి సంతోష్, బెందాళం వరలక్ష్మి, సాయిబాబా, డాక్టర్ రాజశేఖర్, ఉష, కూన అనిల్, మణిశర్మ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి- పోలాకి

ఈదులవలస ఎపి మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కళాశాలలో శుక్రవారం వివిధ క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ పైడి ప్రవీణ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు అండర్-14 విభాగంలో రన్నింగ్‌లో పూడి ఝాన్సీ ద్వితీయ స్థానం, డి.మణికంఠ తృతీయ స్థానంలో నిలిచారు. అండర్-17 విభాగంలో డి.వినీత్ కుమార్ ద్వితీయ, డి.భాను తృతీయ స్థానంలో నిలిచారని, అదే విధంగా క్రరి చందు ఫెన్సింగ్‌లో ప్రదమ స్థానంలో నిలిచినట్టు తెలిపారు. విద్యార్థులను ఫిజికల్ డైరెక్టర్ ఎం.నీలం, ఉపాధ్యాయులు అభినందించారు.

టెక్కలి: టెక్కలి బాలికోన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు పాఠశాల స్కూల్ గేమ్స్ జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు హెచ్ఎం ఎం.శోభారాణి తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులను అభినందించారు. కర్నూల్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి విద్యార్థులు పాల్గొననున్నట్టు ఆమె తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయులు ఆదిశేష్, విద్యార్థినులను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పేడాడ వాణిశ్రీ, నరసమ్మ, కమలకుమారి పాల్గొన్నారు.

పొందూరు: శ్రీకాకుళం కోడి రామమూర్తి స్టేడియంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పొందూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన కె.దిలీప్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయులు డి.ఉదయ్ కుమార్, ఎస్.వి.రమణ, రజిని కుమారి తెలిపారు. ఈ పోటీల్లో 100 మీటర్ల పరుగు పందెంలో దిలీప్ ప్రతిభను కనబరిచి ఏలూరులో త్వరలో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. రాష్ట్ర పోటీలకు ఎంపికైన విద్యార్థిని పాఠశాల హెచ్ఎం పి.వెంకట్రావు, పాఠశాల సిబ్బంది అభినందించారు.


పోలాకి : విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు


చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు, అధికారులు

విద్యార్థి కుటుంబానికి పరిహారం

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

మండలంలోని పాతర్లపల్లిలో ఇటీవల జిల్లా పరిషత్ పాఠశాలలో గోడ కూలి మృతి చెందిన వనుం కృష్ణరాజు తల్లిదండ్రులు కనకారావు, లలితకు సర్వశిక్షా అభియాన్ ద్వారా వచ్చిన చెక్కును ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ విద్యార్థి మృతి బాధాకరమన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి తిరుమల చైతన్య, ఎస్ఎస్ఎ ఇఇ వెంకట నారాయణ మూర్తి, తహశీల్దార్ నందిగాం ప్రసాదరావు, మాజీ జెడ్‌పిటిసి గొర్లె లక్ష్మణరావు, గొర్లె సాయి, లంక శ్యామలరావు, పిసిని జగన్నాథం నాయుడు, మౌళి, సుంకర ధనుంజయ్, చిన్నప్పయ్య పాల్గొన్నారు.

ఎంజిఆర్‌కు మొక్కను అందజేస్తున్న రేంజర్

ఎంజిఆర్‌ను కలిసిన ఫారెస్ట్ రేంజర్

ప్రజాశక్తి- పాతపట్నం

మండల కేంద్రానికి నూతన అటవీశాఖ రేంజర్‌గా శుక్రవారం పదవి బాధ్యతలు చేపట్టిన పి.అమ్మన్నాయుడు స్థానిక ఎమ్మెల్యే మామిడి గోవిందరావును తన పార్టీ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. అక్రమ కలప, వన్యప్రాణుల సంరక్షణలో బాధ్యతగా పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. ఆయనతో పాటు అటవీ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డుకు అడ్డంగా కూలిన మర్రి చెట్టు

కూలిన భారీ వృక్షం

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

మండలంలో టెక్కలి-నౌపడ రోడ్డులో శ్రీరంగం సమీపంలో శుక్రవారం భారీ మర్రి చెట్టు రోడ్డుకు అడ్డంగా నేలకొరిగింది. టెక్కలి మండలం శ్రీరంగం గ్రామ సమీపంలో రోడ్డుపై చెట్టు పడిపోవడంతో ఆ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. గురువారం నుంచి కురుస్తున్న వర్షాల నేపథ్యంలో చెట్టు మొదలు నుంచి కూలిపోయింది. ఆ సమయంలో అటుగా ఎటువంటి వాహనాల రాకపోకలు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని పలువురు చర్చించుకుంటున్నారు. ఉదయం 11 గంటల వరకు రాక పోకలు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. రోడ్డు భవనాల శాఖ అధికారులు, పోలీసులు స్పందించి భారీ వృక్షాన్ని తొలిగించారు.

వ్యాను దిగిపోవడంతో రోడ్డుపై పడిన గ్యాస్ సిలిండర్లు

గుంతలో దిగిన సిలిండర్ల వ్యాను

తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

మండల కేంద్రానికి కూత వేటు దూరంలో ఉన్న పెట్రోల్ బంక్ సమీపంలో అలికాం- బత్తిలి ప్రధాన రహదారి గుంతలో గ్యాస్ సిలిండర్లు పడి పెను ప్రమాదం తప్పింది. సరుబుజ్జిలి నుంచి హిరమండలం వైపు గ్యాస్ సిలిండర్లతో వెళ్తున్న వ్యాన్ ఒక్కసారి భారీ గుంతలో దిగడంతో సిలిండర్లు ఒక్కసారి కిందకు పడిపోయాయి. సిలిండర్ల కింద పడుతున్న సమయంలో భారీ శబ్దం రావడంతో ఎటువంటి భారీ అగ్ని ప్రమాదం సంభవిస్తుందోనని స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ఈ సంఘటనతో కొద్దిసేపు రహదారిపై వాహనాలు నిలిచిపోగా ప్రజలు కూడా ఆ ప్రాంతానికి చేరుకోవడానికి భయపడ్డారు. గ్యాస్ సిలిండర్ల నుంచి ఎటువంటి లీకేజీలు లేకపోవడంతో భారీ ప్రమాదం తప్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

హుకుంపేట హైస్కూల్ ఎదుట రహదారి దుస్థితి

రహదారి అవస్థలు

వజ్రపుకొత్తూరు: మండలంలో రహదారుల దుస్థితి వర్ణనాతీతం. పూండి నుంచి మంచినీళ్లపేట వెళ్ళే రహదారి గోతులతో దర్శనమిస్తుంది. రెండు రోజులుగా కురిసిన వర్షాలకు రహదారులు చెరువులను తలపిస్తున్నాయి. హుకుంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎదురుగా రహదారి దుస్థితి దారుణంగా తయారైంది. స్థానికులు, వాహనచోదకులతో పాటు పాఠశాలకు వెళ్లే విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. గురువారం మంచినీళ్లపేటలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమానికి కేంద్ర, రాష్ట్ర మంత్రులు ఈ రహదారిపైనే వెళ్తారని, రహదారి దుస్థితి చూసి స్పందిస్తారని స్థానికులు ఎంతో ఆశతో ఎదురు చూశారు. అయితే అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు ఈ రహదారిపై రాకుండా కనీసం అప్రోచ్ రోడ్డు కూడా పూర్తి కాని నువ్వలరేవు వంతెనపై నుంచి రావడంతో స్థానికులు అవాక్కయ్యారు. మండలంలోని చాలా రహదారుల పరిస్థితి దారుణంగా ఉంది. ప్రజాప్రతినిధులు, అధికారులు రహదారుల దుస్థితిపై దృష్టిసారించాలని ప్రజలు కోరుతున్నారు.

జూనియర్ ఎన్‌టిఆర్ అభిమానుల సంబరాలు

ఇచ్ఛాపురం: పట్టణంలో ఎల్‌మ్యాక్స్ థియేటర్‌లో దేవర సినిమా విడుదల సందర్భంగా శుక్రవారం జూనియర్ ఎన్‌టిఆర్ అభిమానులు కేకు కట్ చేసి, బాణాసంచా కాల్చి సందడి చేశారు. కార్యక్రమంలో జూనియర్ ఎన్‌టిఆర్ అభిమానులు కొర్రాయి రమేష్, కాళ్ల జయదేవ్, జె.సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న సుధీర్‌కుమార్

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని పలు ప్రాంతాల్లో తోపుడుబళ్లు, ఇతర వాహనాలపై భోజనం, ఇతర పదార్థాల విక్రయ కేంద్రాల వద్ద స్వచ్ఛత పాటించాలని మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డా పి. సుధీర్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని ఆర్ట్స్ కళాశాల రోడ్డులో విక్రయాలు జరుపుతున్న స్ట్రీట్ వెండర్లకు స్వచ్ఛతా హీ సేవపై అవగాహన కల్పించారు. విక్రయ కేంద్రాల వద్ద బ్లీచింగ్, సున్నం వంటివి వేయించారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం వికసిత్ భారత్ 2047 నాటికి అభివృద్ధి చెందాలంటే ఏఏ రంగాల్లో దృష్టి సారించి విజనతో ముందుకెళ్లాలనే అంశం పైన ఎంఇఒలు డి.గౌరినాయుడు, ఆర్.ఆనందరావు ఆధ్వర్యంలో మండల స్థాయి విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఆరు నుండి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులతో వ్యాసరసన, వక్తవ్య పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈనెల 28న నియోజకవర్గ స్థాయిలో నిర్వహించనున్న వ్యాసరచన పోటీలకు మండల స్థాయిలో విజేతలైన విద్యార్థులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులకు సమాచారం అందజేశారు.

నేడు మన ఇల్లు -మన గౌరవం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లో ఈ నెల 28న మన ఇల్లు -మన గౌరవం కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల గృహ నిర్మాణ శాఖ ఎఇ వావిలపల్లి వినోద్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి గృహ లబ్ధిదారులు, అధికారులు, ప్రజా ప్రతినిధులుపాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

బుడ్డిపేటలో పొలంబడి

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని బుడ్డిపేటలో పొలంబడి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఎస్.అవినాష్ వరి పంటలో అవలంబించే దీర్ఘ కాలిక, స్వల్పకాలిక పద్ధతుల గురించి చర్చించారు. విత్తనశుద్ధి, విత్తే సమయం, మొనలు తుంచటం, నారుమడి యాజమాన్యం, చేతితో కలుపు తీయటం వంటి స్వల్ప కాలిక పద్ధతులను వివరించారు. అలాగే దీర్ఘకాలిక పద్ధతులైన విత్తన రకాల ఎంపిక, సస్య భ్రమణం, పచ్చిరొట్ట మొక్కలు పెంచి కలియ దున్నడం, ఎరువుల యాజమాన్యం, తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విఎఎ పి.లక్ష్మణ్, బి.సుధీర్, పొలంబడి రైతులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

విద్యార్థుల రక్త నమూనాల సేకరణ

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం వైద్య సిబ్బంది విద్యార్థులకు రక్త నమూనాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా రక్త నమూనాలతో పాటు ఎత్తు, బరువు, వివరాలను రికార్డులో పొందుపర్చారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ భాస్కర్, అధ్యాపకులు, వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థి నుంచి రక్త నమూనా సేకరిస్తున్న వైద్య సిబ్బంది

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలి

ప్రజాశక్తి- పలాస

విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వ రంగంలోనే నడపాలని, ప్రైవేటీకరణ ఆపాలని సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు అన్నారు. శుక్రవారం సూది కొండలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భగా మాట్లాడుతూ విశాఖ ఉక్కు లాభాల బాటలో నడవడానికి అవకాశాలు చాలా ఎక్కువగా ఉన్నాయని, సొంత గనులు కేటాయించా లన్నారు. సొంత గనులు లేనందున ముడి సరుకు మిగతా కంపెనీలకు రూ.1500 పడితే విశాఖ ఉక్కుకు రూ.7 వేలు వరకు ఖర్చవుతుందని కేంద్ర ప్రభుత్వం తక్షణమే విశాఖ ఉక్కును కాపాడేందుకు సొంత గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు పరిశ్రమపై నేడు దాదాపు ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షలాది కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాయన్నారు. చత్తీస్ ఘడ్, భిలాయిలో స్టీల్ ప్లాంట్ అమ్మేస్తామంటే అక్కడ రాష్ట్ర ప్రభుత్వం కొనుక్కోవడానికి ముందుకు వచ్చిందన్నారు. కూటమి ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తెచ్చి విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపించాలని కోరారు. ప్రజలకు ఉపయోగపడే విశాఖ ఉక్కు పరిశ్రమను కాపాడుకోవాలని, థర్మల్ పవర్ ప్లాంట్లు, అణు విద్యుత్ కేంద్రాలు, కెమికల్ పరిశ్రమలు నిలుపుదల చేయాలన్నారు. కార్యక్రమంలో జుత్తు వీరాస్వామి, మద్దిల. వినోద్, మామిడి భీమారావు, షణ్ముఖరావు, సరస్వతి పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

చట్టాలపై అవగాహన అవసరం

పాతపట్నం : మాట్లాడుతున్న సిఐ సాయి

ప్రజాశక్తి- పాతపట్నం

విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సిఐ ఎన్. సాయి అన్నారు. శుక్రవారం స్థానిక మోడల్ డిగ్రీ కళాశాలలో గంజాయి, డ్రగ్స్ వంటి మాదక ద్రవ్యాల వలన కలిగే అనర్థాలు, రోడ్డు ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, వాహనానికి సంబంధించిన ధ్రువపత్రాలు వెంట తీసుకు వెళ్లాలన్నారు. మైనర్లు వాహనాలు నడపడం నేరమన్నారు. సైబర్ నేరాలకు గురైతే వెంటనే 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీరాములు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలాకి: మండలంలోని ఈదులవలస మోడల్ స్కూల్, కళాశాలలో ఎస్ఐ రంజిత్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ పైడి ప్రవీణ పాల్గొన్నారు.

పొందూరు: మండలం వావిలపల్లిపేట వద్దగల ఎపి మోడల్ స్కూల్‌లో ఎస్ఐ సత్యనారాయణ మత్తు పదార్థాల నిషేధంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ బి.వి. సత్యనారాయణ, మహిళా పోలీస్ అనిత, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆమదాలవలస : మండలంలోని కొర్లకోట సైబర్ మోసాలపై ఎస్ఐ కె.వెంకటేష్ ప్రజలకు అవగాహన కల్పించారు. ఎవరైనా సైబర్ మోసాలకు గురైతే వెంటనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పొందూరు : అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

రణస్థలం : మొక్కలు నాటుతున్న సభ్యులు

ప్రజాశక్తి- రణస్థలం

ప్రతివ్యక్తి మొక్కలు నాటి, సంరక్షించాలనే సంప్రదాయాన్ని బాల్యదశ నుంచే అలవాటు చేయాలని హరిత సమగ్ర గ్రామీణాభివృద్ధి సొసైటీ కన్వీనర్ ఆర్.హరిబాబు అన్నారు. శుక్రవారం హరిత సొసైటీ సభ్యులు పల్లి మహేష్, సాయి విజయ దంపతుల కుమార్తె విహాన పుట్టినరోజు సందర్భంగా ఉప్పువలస ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు ఆహ్లాదాన్ని ఇవ్వడమే కాకుండా భవిష్యత్ తరాలకు మంచి ఆరోగ్యకరమైన వాతావరణం సమకూర్చుతాయని అన్నారు. కార్యక్రమంలో హరిత సొసైటీ సెక్రటరీ పి.తవిటినాయుడు, జాయింట్ సెక్రటరీ బి.లక్ష్మీనరసింహ మూర్తి, సొసైటీ సభ్యులు రత్నాకర్, ఆర్.మధు గ్రామస్తులు పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : మొక్కలు నాటి కాలుష్యం నియంత్రించాలని డిఎల్‌పిఒ ఐ.వి.రమణ అన్నారు. మండలం కె. కొత్తూరు పంచాయతీలో చెత్త సేకరణ కేంద్రం వద్ద మొక్కలు నాటారు. కార్యక్రమములో కార్యదర్శులు పాల రవి, బి.బాబూరావు, పి.రమేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : మొక్కలు నాటుతున్న డిఎల్‌పిఒ రమణ

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీష

దేశంలో అగ్రగామిగా రాష్ట్రం

ప్రజాశక్తి- పలాస

స్వర్ణాంధ్ర-2047 గొప్ప విజన్ ఉన్న కార్యక్రమని, రాష్ట్రం భారతదేశంలోనే అగ్రగామిగా నిలుస్తుందని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం స్వర్ణాంధ్ర-2047 కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ జె.వెంకటలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇది మంచి ప్రభుత్వం ఇది ప్రజల ప్రభుత్వం అనే నినాదంతో ఈ కార్యక్రమాన్ని రూపొందించడం జరిగిందన్నారు. రాష్ట్రంలో విద్య, ఆరోగ్యం, సామాజిక సంక్షేమం, వ్యవసాయం, పర్యాటకం, ఆర్థికాభివృద్ధి వంటి అంశాల్లో ఉన్నత స్థానమును చేరుకుంటుందన్నారు. అందుకు తగిన వనరులు పుష్కలంగా ఉన్నాయని, దీన్ని వినియోగించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎపిటిపిసి చైర్మన్ వజ్జ బాబూరావు, వైస్ ప్రిన్సిపాల్ గణపతిరావు, వెంకటరమణ, మధు, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న జూనియర్ సివిల్‌జడ్జి

లింగ నిర్ధారణ పరీక్షలు నేరం

కోటబొమ్మాళి: లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం చట్టరీత్యా నేరమని, అటువంటి నేరానికి జైలు శిక్షతో పాటు అధిక మొత్తంలో జరిమానాలు వేయటం జరుగుతుందని స్థానిక జూనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయసేవాధికార సంస్థ అధ్యక్షులు బి.ఎం.ఆర్ ప్రసన్నలత అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం లింగ వివక్షత నిరోధం అంశంపై న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వి.సంతోషి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వజ్జ బాబూరావును సన్మానిస్తున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

బాబూరావుకు సత్కారం

ప్రజాశక్తి- పలాస

టిడిపి రాష్ట్ర కార్యదర్శి వ.ఇ. బాబూరావుకు కూటమి ప్రభుత్వంలో రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ పదవిని చంద్రబాబునాయుడు ఇవ్వడంతో బాబూరావుకు లయన్స్ క్లబ్ సభ్యులు బాబూరావు స్వగృహంలో శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. బాబూరావుకు ఘనంగా ఆయనను ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు హెచ్‌వి దొర, కుమార్ నాయక్, తమ్మినేని మాధవరావు, తెప్పల కృష్ణమూర్తి, దోకి రామారావు, విద్యా వాహిని కళాశాల కరస్పాండెంట్ పైల తిరుమలరావు, పైల సంజయ్, కొర్రాయి బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.